# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-04-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ బాధ్యతగల పౌరునిగా ఉండడమే అంబేద్కర్‌కు ఇచ్చే నివాళి అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.**

2. **విశాఖపట్నం - సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు తాడేపల్లిగూడెంలో హాల్ట్ సౌకర్యాన్ని కల్పించనున్నామని కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ వెల్లడించారు.**

3. **జువ్వలదిన్నె హార్బర్‌ను 288.80 కోట్ల రూపాయల పెట్టుబడితో అభివృద్ధి చేస్తున్నామని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.**

4. **మారుతున్న కాలానికి అనుగుణంగా అగ్నిమాపక శాఖ సేవలు కూడా విస్తరించాయని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు.**

5. **ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో రాష్ట్రానికి 20 లక్షల కనెక్షన్‌లు మంజూరయ్యాయని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.**

==========================

రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ బాధ్యతగల పౌరుడిగా ఉండటమే అంబేద్కర్ కు ఇచ్చే నివాళి అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

--------------------------

అంబేద్కర్ జయంతి వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో నిర్వహిస్తున్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ప్రకాశం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం తిరుపతి జిల్లాల్లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పలువురు మంత్రులు, శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు. ఇందులో భాగంగా కృష్ణా జిల్లా మచిలీపట్నంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర నివాళు లర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అంబేద్కర్ ఎంతగానో కృషి చేశారని తెలిపారు. విభిన్న సంస్కృతులు కలిగిన దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించారని

మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..30.. సెకన్లు

---

దేశంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ యార్డ్‌గా జువ్వలదిన్నె హార్బర్‌ను 288.80 కోట్ల రూపాయల పెట్టుబడితో అభివృద్ధి చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అమరావతిలో ఆయన ఈరోజు మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుతో నౌకా నిర్మాణం, స్వయం ప్రతిపత్తి వ్యవస్థల అభివృద్ధి, మెరైన్ ఇంజనీరింగ్, పరిశోధన, అభివృద్ధి వంటి రంగాల్లో యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఈ హార్బర్ నిర్మాణం ద్వారా 25 వేల మత్స్యకార కుటుంబాలు లబ్ధి పొందనున్నాయని చెప్పారు. 12 వందల 50 యాంత్రీకృత, మోటారు ఆధారిత చేపల పడవలను సురక్షితంగా నిలిపేలా సదుపాయం కల్పించామని మంత్రి వివరించారు.

---

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో విశాఖపట్నం – సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్ట్ సౌకర్యాన్ని కల్పించనున్నామని కేంద్ర ఉక్కు పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ వెల్లడించారు. జిల్లాలో రైల్వే సర్వీసుల విస్తరణలో సాధించిన పురోగతిపై భీమవరంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ, గతంలో ఉన్న 9 ప్రత్యేక రైళ్లను ఇప్పుడు రెగ్యులర్ సర్వీసులుగా మార్చినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల ప్రయాణికుల కోసం, భీమవరం టౌన్, భీమవరం, పాలకొల్లు, నరసాపురం స్టేషన్లలో పలు రైళ్లు ఆగేలా చర్యలు తీసుకుంటున్నామని శ్రీనివాస వర్మ వివరిస్తూ,

వాయిస్..25.. సెకన్లు

---

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో రాష్ట్రానికి 20 లక్షల కనెక్షన్‌లు మంజూరయ్యాయని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మార్కాపురం జిల్లా దొనకొండ మండలంలోని మల్లంపేట గ్రామ ఎస్సీ కాలనీలో 44 గృహాలకు మంజూరైన ఉచిత సోలార్ యూనిట్లను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా గృహాలపై ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ ప్యానల్స్ పనితీరును పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి రవికుమార్ మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో 200 యూనిట్ల కరెంట్ వినియోగించే ఎస్సీ, ఎస్టీలకు ఆరు లక్షల సోలార్ కనెక్షన్లు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అందులో దర్శి నియోజకవర్గానికి 50.39 కోట్ల రూపాయలతో 4 వేల 39 కనెక్షన్లు మంజూరయ్యాయని మంత్రి వివరించారు.

---

అగ్నిమాపక శాఖ వారోత్సవాలను రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఈరోజు ప్రారంభించారు. విజయవాడ గవర్నర్‌పేటలోని రాష్ట్ర అగ్నిమాపక సేవల ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అగ్నిమాపక అమరవీరుల స్మృతికి డీజీపీ నివాళులు అర్పించారు. అనంతరం అగ్నిమాపక శాఖ ఆధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. ప్రమాదం సంభవించినప్పుడు ప్రాణాలను కాపాడేందుకు అగ్నిమాపక సిబ్బంది ముందుంటారని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అగ్నిమాపక శాఖ సేవలు కూడా

విస్తరించాయని డీజీపీ తెలుపుతూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించడం ద్వారా దేశ రాజకీయాల్లో మహిళల పాత్ర మరింత బలోపేతమవుతుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్లతో లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుందన్నారు. ఈ బిల్లుకు పార్లమెంటులో ఆమోదం దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం శుభపరిణామమని పేర్కొన్నారు.

---------------------------

పోషణ పక్షోత్సవాలలో భాగంగా ప్రజల్లో ఆరోగ్యం, పోషణపై విస్తృత అవగాహన కల్పించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. నంద్యాలలోని కలెక్టర్ కార్యాలయంలో పోషణ పక్షోత్సవాలకు సంబంధించిన గోడప్రచార పత్రికలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 23 వరకు పోషణ పక్షోత్సవాలను “నిర్దిష్ట ప్రచార కార్యక్రమ” విధానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మారుతున్న ఆధునిక జీవనశైలితో చిన్నారులకు ఆరోగ్యం, పోషణ అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలకు జంక్ ఫుడ్ బదులుగా ఇంట్లో తయారుచేసిన పౌష్టికాహారం ఇవ్వాలని సూచించారు.

---------------------------

జనగణన-2027 ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వీయ గణన విధానంపై విశాఖపట్నం జిల్లావ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ తొలిసారిగా ప్రజలే స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునేందుకు ఈ నెల 16 వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల పౌరులు నిర్ణీత గడువులోగా se.census.gov.in పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం తరపున 15 రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

=====================